ప్రజాశక్తి
ఆదివారం 1 జూన్ 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



నేటి నుంచి మలేరియా నివారణ మాసోత్సవాలు

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాలతో నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు మలేరియా నివారణ మాసోత్సవాలు సందర్భంగా వాల్ పోస్టర్లు బ్యానర్లు ను ఆ శాఖ అధికారి కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వి.సుజాత మాట్లాడుతూ కీటకజనిత వ్యాధుల పట్ల జిల్లాలో ని వివిధ పట్టణ ఆరోగ్య కేంద్రాలు , ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పరిధిలో ప్రజలు మలేరియా జ్వరాలు రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఎన్ఆర్‌హెచ్ఎం పిఓ డాక్టర్ రమేష్ యితర ప్రోగ్రామ్ ఆఫీసర్లు మలేరియా ,ఐడిఎస్‌పి సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నేటి నుంచి 'రేషన్' షాపుల వద్దే..!

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల శాఖలో కీలక నిర్ణయం తీసుకొచ్చింది. పాత పద్ధతిలోనే రేషన్ కార్డు దారులకు బియ్యం , సరుకులను పంపిణీ చేయనున్నారు.

నేటి నుంచి రేషన్ దుకాణాల వద్దే బియ్యం. సరుకులు పంపిణీ చేయనున్నారు. ఇంటి వద్దకే వాహనాలలో రేషన్ సరఫరా చేసే విధానానికి ప్రభుత్వం స్వస్తి చెప్పింది. ప్రతి నెలా 1 నుంచి 15 వతేదీ వరకు గతంలోగానే రేషన్ షాపు నుంచే సరుకులు తీసుకోవాల్సి ఉంటుంది. ఉదయం 8నుంచి రాత్రి 8 గంటల వరకు సరఫరా చేస్తారు. 65 సంవత్సరాలు దాటిన వారికి రేషన్ డీలర్లు ఇంటి వద్దకే వెళ్లి సరుకులు ఇస్తారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఎక్కువ మంది వ్యతిరేకిస్తున్నట్లు తెలిసింది. రేషన్ షాపులున్నప్పుడు.. వాహనాలు సరఫరా చేసినప్పుడు రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగింది. దీనిని అరికట్టాలని ప్రభుత్వం ఆ సాకుతో వినియో గదారులకు అనుకూలంగా విధానానికి స్వస్తి చెప్పింది. ఈ విధానం ప్రభుత్వానికి నష్టంగా కనిపిస్తోంది. జిల్లా వ్యాపితంగా 1513 రేషన్ షాపుల ద్వారా 7.21 లక్షల రేషన్ దారులకు 10.953 టన్నుల బియ్యం సరఫరా చేయనున్నారు. అందుకోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డిఎస్ఒ ఎన్. విజయ్ కుమార్ తెలిపారు.

- ◆1-15 వతేదీ వరకు
- ◆ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు సరఫరా
- ◆65 సంవత్సరాలు దాటితే ఇంటి వద్దకే
- ◆ప్రభుత్వానికి నష్టమా..లాభమా..?

జిల్లా వ్యాపితంగా 38 మండలాల పరిధిలో 1513 రేషన్‌షాపులు న్నాయి.. 2019 కు ముందు రేషన్‌కార్డు దారులు షాపుల వద్దకు వెళ్లి బియ్యం,చక్కెర, కందిపప్పు, నూనె, వంటి నిత్యావసర సరుకులు తెచ్చుకునేవారు. డీలర్లకు ప్రభుత్వం కొంత శాతం కమీషన్ ఇచ్చేది. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ శాఖలో కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. కార్డు దారులు షాపుల వద్దకు వెళ్లి గంటలు గంటలు క్యూల్లో నిలుచోకుండా ఇంటింటికి రేషన్ పథకం తీసుకొచ్చారు.గతంలో సరుకుల కోసం పేదలు కూలీ పనులు మానుకొని మరీ షాపుల వద్ద పడిగాపులు కాచే పరిస్థితులుండేవి. గత ప్రభుత్వం జిల్లా వ్యాపితంగా 348 వాహనాలు కొనుగోలు చేసింది. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి ఐదు వరకు ఇంటింటికి వెళ్లి సరుకులు సరఫరాచేసేవారు. ఇంటింటికి వెళ్లకపోయినా వీధి వీధికి వెళ్లి సరుకులు సరఫరా చేశారు. . ఈ నిర్ణయం తీసుకున్న సర్వర్లు సరిగా పనిచేయకపోవడంతో అప్పుడు, ఇప్పుడు ఇబ్బందులు పడేవారు. ఈ నిర్ణయం కార్డుదారులకు కొంత ఉపశమనంగానే చెప్పొచ్చు. ఈ నిర్ణయం ద్వారా 30 శాతం మందికి రేషన్ బియ్యం ఇవ్వలేదని, సరుకులు పక్కదారి పట్టాయని ప్రభుత్వం భావిస్తోంది. విజిలెన్స్ సర్వేలోని ఇది బయటపడింది. ఇదేజన కాలంలో రేషన్ బియ్యం పెద్ద ఎత్తున ప్రాంతాలకు తరలిపోతున్నాయి. వీటిని కట్టడి చేయడానికి ప్రభుత్వం కొత్త నిర్ణయం తీసుకుంది. ఎప్పటి నుండో రేషన్ పక్కదారి పడుతూనే ఉంది. ఇతర ప్రాంతాలకు రీసైకిల్ జరుగుతూనే ఉంది. అధికారపార్టీల నాయకుల ఇందులో కీలకమైన వ్యక్తులు , అవినీతి, అక్రమాలను ప్రభుత్వాలు నియంత్రించలేక పోయింది. ఈ పని అప్పుడు వైసిపి, ఇప్పుడు టిడిపి చేయలేదనే చెప్పాలి. ఆ సాకు చూపించి ఇంటింటికి రేషన్ సరఫరా చేసే విధానాన్ని మార్పు చేశారు. నేటి నుంచి మహిళలు, ఇళ్లల్లో పనులు మానుకొని, పురుషులు కూలీ పనులు మానుకొని ప్రభుత్వం ఇచ్చే బియ్యం కోసం రేషన్‌షాపుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందనే విమర్శలు వస్తున్నారు. ఇది ప్రభుత్వానికి నష్టమంగానే వినియోగదారులు చెబుతున్నారు.

1513 షాపులు..10.953 టన్నులు..!

నేటి నుంచి రేషన్ షాపుల వద్దే సరుకులు తీసుకునేలా ప్రభుత్వం నిర్ణయం చేసింది. ప్రతినెల ఒకటి నుండి 15 వతేదీ వరకు షాపుల్లో సరుకులు ఇస్తారు. జిల్లా వ్యాపితంగా 1513 షాపులున్నాయి. జిల్లాలో 7,21,524 కార్డులున్నాయి. ఇందులో 6,25,119 ఈ-పాస్ సిస్టమ్‌లో నమోదు చేసుకున్నారు. తెల్లరేషన్ కార్డులు 6,82,559 ఉండగా, ఎఎవై కార్డులు 38,965 ఉన్నాయి. ప్రతి నెల బియ్యం, చక్కెర, పప్పులు సరఫరా చేస్తున్నారు. 10,953 మెట్రిక్ టన్నుల బియ్యం, 380 టన్నుల చక్కెర, 721 టన్నుల పప్పులు రేషన్ షాపుల నుంచి సరఫరా చేస్తున్నారు. ప్రత నెల ఒకటి నుంచి 15 వతేది వరకు రేషన్ షాపుల వద్ద సరుకులు ఇస్తారు. జిల్లా వ్యాపితంగా పాత రేషన్‌షాపుల వద్దే సరుకులు పంపిణీ చేయనున్నారు. నెల్లూరు నగరంలో మంత్రి నారాయణ, ఆయా నియోజ కవర్గాల్లో ఎంఎల్ఎలు దీనిని పర్యవేక్షించనున్నారు. ఆర్డీఒలు, తహశీల్దార్లు రేషన్ పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు.

రేషన్ పంపిణీకి సర్వం సిద్ధం

నేటి నుంచి రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని డిఎస్ఓ ఎన్., విజయకుమార్ తెలిపారు. ప్రతి నెల 1 నుంచి 15 వతేదీవరకు , ఉదయం 8 నుంచి 12 వరకు సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు సరఫరా చేస్తామన్నారు. షాపుల్లో పనివేళలు, సరుకుల నిల్వలు, బోర్డుపై రాస్తారని తెలిపారు. 65 సంవత్సరాలు పైబడి వారికి, వికలాంగులకు ఇళ్లవద్దనే రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు. ఈ-పాస్, వేయింగ్ మిషన్లు కండిషన్‌గా ఉంచుకోవాలని, కార్డు దారులకు కొలతలు, తూకాలు, రశీదుల ఇవ్వాలని డీలర్లను ఆదేశించామన్నారు. కొత్త రేషన్‌కార్డుల, కార్డుల విభజన, సింగిల్ మెంబర్ , కొత్త సభ్యుల చేరికలు, ఆధార్ సిడింగ్, చిరునామా మార్పులు, అన్ని గ్రామ సచివాయాల్లో చేయడం జరుగుతుందన్నారు. అందరూ డీలర్లు ప్రభుత్వ ఆదేశాలను పాటించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

'భాను'కు అభినందనలు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లా అల్లూరు మండలం ఇందుపూరు నివాసి ఏటూరు భానుప్రకాష్ కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ కమీషనర్‌గా నియమితులు అవ్వడం అబినందనీయమని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తన స్వగ్రామం నుంచి కేంద్ర ఎన్నికల సంఘం స్థాయికి ఎదిగిన భాను అందరికీ ఆదర్శనీయులన్నారు. సొంత జిల్లా, గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చారన్నారు. భవిష్యత్‌లో మరన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆయన ఆకాంక్షించారు.

సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు :ఎసిఎస్ఆర్ ప్రభుత్వ వైద్య శాలలోని ఏఆర్‌టి సెంటర్ నందు హెచ్‌ఐవి నియంత్రణ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా లెప్రసి.ఎయిడ్స్ టీబీ నివారణ అధికారి డాక్టరు.ఎస్‌కె ఖాదర్ వలీ విచ్చేసి , జిల్లా లో హెచ్‌ఐవి వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న సేవలు గురించి , మందులు సరిగా తీసుకొని వారి వివరాల గురించి చర్చించారు.విధుల్లో ఏ మాత్రం అలసత్వం లేకుండా పనిచేయాలని ఏఆర్‌టి సెంటర్ సిబ్బందిని మరియు స్వచ్ఛంద సంస్థలను ఆదేశించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం . ఏఆర్‌టి సిబ్బంది ,స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు.

కాకాణి'తో సజ్జల ములాఖత్..!

వ్యవస్థలు నాశనం చేస్తున్నారు..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

జైలు బయట మీడియాతో మాట్లాడుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని వైసిపి ప్రభుత్వంలో సలహాదారులు పిపిపి రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి జైల్లో పరామర్శించారు. శనివారం ఉదయం కొత్తూరులోని జిల్లాలో జైల్లో ఆయనతో ములాఖత్ అయ్యారు. పలు విషయాల గురించి ఇరువురు నేతలు చర్చించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే జైల్లో పెట్టిందన్నారు. ఒకవేళ తప్పు చేసుంటే విచారణ జరపాలని, అలా కాకుండా వ్యవస్థలను చేతుల్లో పెట్టుకొని వైసిపి నాయకులను జైల్లో పెడుతున్నారన్నారు, తమ ప్రభుత్వంలో న్యాయ బద్ధంగా వ్యవహరించామని, చంద్రబాబునాయుడుని విచారణ అనంతరం మాత్రమే అరెస్ట్ చేశామన్నారు. రాష్ట్ర వ్యాపితంగా వైసిపి నాయకులను జైలుకు పంపుతున్నారని, ఇది ఇలానే కొనసాగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. తాము అధికారంలోకి వస్తే ఇంతకన్నా దారుణమైన పరిస్థితులుంటాయన్నారు. అధికారులు చంద్రబాబునాయుడు, లోకేష్‌కు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అక్కడ నుంచి పొదలకూరు రోడ్డులోని కాకాణి నివాసానికి చేరుకున్నారు. కాకాణి కుమార్తె పూజితను కలుసుకున్నారు. గోవర్దన్‌రెడ్డి ఎలాంటి తప్పు చేయలేదని, కూటమి ప్రభుత్వం కుట్రతో అరెస్ట్ చేసిందన్నారు. న్యాయ స్థానంలో కాకాణికి క్లీన్ చిట్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ అండగా ఉంటుందని, అధైర్య పడవద్దని, జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని చెప్పారు. ఆయన వెంట ఎంఎల్‌సి పి. చంద్రశేఖర్‌రెడ్డి, మేరుగ మురళి, మాజీ ఎంఎల్ఎ కె. సంజీవయ్య, రూరల్ ఇన్‌ఛార్జ్ ఆనం విజయకుమార్‌రెడ్డి, తదితరులున్నారు.

పొదుపు మహిళల సమస్యలు పరిష్కరించాలి : ఐద్వా

ప్రజాశక్తి-నెల్లూరు : ఐద్వా నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని పొదుపు మహిళల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మెప్మా ప్రాజెక్ట్ అధికారి లీలారాణి ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ బి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వ నాయకులు చేసిన హామీలను అను సరించి పొదుపు గ్రూపు మహిళలకు వడ్డీ మాఫీ, రుణమాఫీ అమలు చేయని ఐద్వా డిమాండ్ చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మెప్మా సిబ్బందిని వివిధ రకాల సర్వేలు,ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలకు పరిమితం చేశారే తప్ప పొదుపు మహిళల సమస్యలను పరిష్కరించేదిశగా ఆలోచన చేయలేదన్నారు. ఐద్వా నగర కార్యదర్శి కత్తి పద్మ మాట్లాడుతూ బ్యాంక్ లింకేజీ రుణాలపై విధిస్తున్న అధిక వడ్డీని తగ్గించాలని, ఇన్సూరెన్స్ పేరుతో బలవంతపు వసూళ్లను నిలిపివేయాలని, చనిపోయిన పొదుపు మహిళల రుణాలను ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. ఇంకా పలు సమ స్యలను వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఐద్వా నగర అధ్యక్షురాలు ఎన్ వి సుబ్బమ్మ, నగర నాయ కులు కే సంపూర్ణమ్మ, షేక్ మహమ్మదా, షేక్ సల్మా, షేక్. షాహిన్, వి.లక్ష్మి ఐ.విజయలక్ష్మి ఉన్నారు.

మెప్మా పీడీని కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నాయకులు

కాలువల్లో పూడికతీత

ప్రజాశక్తి నెల్లూరు కార్పొరేషన్ :వర్షపు నీరు సాఫీగా పారేందుకు వీలుగా నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో డ్రైయిన్ కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టామని కమిషనర్ వై.ఓ నందన్ తెలిపారు.పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా 4వ డివిజన్ రాంనగర్, 40 వ డివిజన్ వాకర్స్ రోడ్డు ప్రాంతంలో కమిషనర్ పర్యటించారు. అనంతరం పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలోని అన్న క్యాంటీన్ సందర్శించి ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను రుచిని స్వయంగా తిని పరిశీలించారు. అన్న క్యాంటీన్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచి ప్రజలకు మెరుగైన సేవలందించాలని కమిషనర్ నిర్వాహకులకు సూచించారు.

పూడికతీత పనులు పరిశీలిస్తున్న కమిషనర్

'మాలకొండ'లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - వలేటివారిపాలెం :మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం శనివారం భక్తుల తాకిడితో కిటకిటలాడింది. అయితే మధ్యాహ్నం 12 గంటల సమయంలో కొండపైన కొబ్బరికాయలు అమ్మే షాపింగ్ కాంప్లెక్స్ వెనుక అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన దేవస్థానం సిబ్బంది కందుకూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్ని మాపక వాహనం సిబ్బంది హుటాహుటిన మాలకొండకు చేరుకున్నారు. మంటల తీవ్రత పెరగకుండా సిబ్బంది అప్పటికే చిన్నపాటి పైపుతో నీళ్ల పెట్టి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను పూర్తిస్థాయిలో అదుపు చేయడంతో గంటల తరబడి అక్కడే స్వామి దర్శనం కోసం వేచి ఉన్న వేలాది మంది భక్తులు, దుకాణాల వ్యాపారులు పెను ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి -వలేటివారిపాలెం

మండలంలోని చుండి పంచాయతీలోని కాకర్లపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్ర మంలో ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొన్నారు. నియోజక వర్గంలోని ప్రజలం దరూ ఆయురా రోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసిం హాం, నల్లబోతుల కొండలరావు, హరికష్ణ, లక్ష్మీ, బ్రహ్మయ్య, రమణయ్య ఉన్నారు.

నేడు రేషన్ షాప్ సందర్శన

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణం నాంచారమ్మ కాలనీలో వున్న చౌక ధరల దుకాణమును ఆదివారం ఉదయం 8 గంటలకు కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సందర్శిస్తారు.కార్డుదారులకు ప్రభుత్వం అందించే సరుకులను పంపిణీ కార్యక్రమంలో అయన పాల్గొంటారని ఎంఎల్ఎ కార్యాలయం తెలిపింది. కూటమి నాయకులు పాల్గొనాలని సూచించారు.

పేదలకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు

శ్రీ రామసాయి బాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా శనివారం బోణాల శ్రీనివాస చక్రవర్తి, సుభాషిణి దంపతుల ఏకైక పుత్రిక మానస పుట్టినరోజు సందర్భంగా వారి సహకారముతో పట్టణ వీధుల్లో తిరుగుతూ ఉండే యాచకులకు మధ్యాహ్నం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆ సొసైటీ కందుకూరు అధ్యక్షులు డా. రవ్వా శ్రీనివాసులు మాట్లాడారు. దాతలు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న సిఎం

పింఛన్ల పంపిణీలో మంత్రి నారాయణ

ప్రజాశక్తి-నెల్లూరు

ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం పెన్షన్ రూ.4 వేలు అందించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట నిలబెట్టుకున్నారని పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శనివారం ఆయన నగరపాలక సంస్థ 3 డివిజన్ జాఫర్ సాహెబ్ కాలువ గట్టుపై నివసిస్తున్న లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన ప్రకారం నూరు శాతం హామీలు అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.రాష్ట్రంలో 68 లక్షల మందికి ప్రతి నెల ప్రభుత్వం ఒకటవ తేదీనే పింఛను అందిస్తున్నదని 1వ తేదీ సెలవు వస్తే ముందు రోజే పెన్షన్లు అందిస్తున్నామని వెల్లడించారు.పింఛన్ల పంపిణీ చేసిన అనంతరం జాఫర్ కాలువ ఒడ్డున నివసిస్తున్న కుటుంబాల మహిళలతో మంత్రి నారాయణ ముఖాముఖి మాట్లాడారు. కాలువగట్లపై నివసిస్తున్న అతిపేదలు తమ పిల్లలను విఆర్ పాఠశాలలో చేర్పించాలన్నారు. ఈ పాఠశాలలో ఎల్‌కెజీ నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్య అందిస్తామన్నారు. ఉదయం అల్పాహారం మధ్యాహ్నం భోజనం సాయంత్రం స్నాక్స్ ప్రయాణ సౌకర్యం కూడా ఉచితంగా కల్పిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ వై ఓ నందన్ స్థానిక నాయకులు ,ప్రజా ప్రతినిధులు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

ప్రజాశక్తి - వలేటివారిపాలెం.

పింఛన్ల నగదు పెంపు ఘనత తెలుగుదేశం పార్టీ దేనని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని చుండి, కాకర్లపాలెం గ్రామాల్లో ఎంఎల్ఎ చేతుల మీదుగా పింఛన్ల నగదును వద్దులకు పంపిణీ చేశారు. తొలుత కాకర్లపాలెంలో కోదండరామ స్వామి దేవస్థానం నిర్మాణంలో భాగంగా ధ్వజస్తంభం ప్రతిష్ట కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఎంపిడిఒ కె నరేంద్ర దేవ్, మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, టిడిపి యువ నాయకులు కాకుమాని హర్ష, గ్రామపార్టీ నాయకులు నల్లబోతుల కొండలరావు, హరికష్ణ, బ్రహ్మయ్య, రమణయ్య ఉన్నారు.

పొగాకు ఉత్పత్తుల వినియోగం ప్రమాదకరం

ప్రజాశక్తి-నెల్లూరు నగరం

పొగాకు వాడకంతో ఆరోగ్యానికి ప్రమాదకరమని, ఎన్ టిసిపి, ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తొలుత స్థానిక సంతపేటలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ వి. సుజాత పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. సంతపేట, గుప్తా పార్కు తదితర ప్రాంతాలలో ర్యాలీ నిర్వహించారు. ఎన్ సి సి క్యాడట్లచే నిర్వహించిన ఈ అవగాహన ర్యాలీ పలు ప్రాంతాలలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య అధికారిణి సుజాత మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల సంభవించే పలు వ్యాధుల పై ప్రజల అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా వైద్య ఉప ఆరోగ్య అధికారి డాక్టర్ ఖాదరవల్లి మాట్లాడుతూ యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు.కార్యక్రమంలో డాక్టర్ యశ్వంత్, ఎం.హాసిని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, నారాయణ మెడికల్ కళాశాల నర్సింగ్ స్టాఫ్ లు పాల్గొన్నారు.

నెల్లూరు : కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పిఎంపి అసోసియేషన్) ఆధ్వర్యంలో శనివారం, నారాయణ డెంటల్ కాలేజ్ హాస్పిటల్ సమావేశ మందిరంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం (వరల్డ్ నో టుబాకో డే) సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు.జిల్లా పిఎంపి గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్ ,శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, నరసాపురం ప్రసాదు, ఉప్పలపాటి రామదాసు,పి.మోహన్ ఉన్నారు.

శిథిలావస్థలో మెప్మా కార్యాలయం

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా- వెలుగు) ప్రాజెక్టు అధికారి కార్యాలయం శిథిలావస్థ స్థితికి చేరుకుంది. కార్యాలయం స్లాబు పెచ్చులు ఊడి ఏ క్షణం లో అయినా కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. ఈ భవన నిర్మాణం అయి సుమారు 50 ఏళ్లు పూర్తి కావస్తుంది. 1991లో అప్పటి ప్రభుత్వం నిర్వహించిన డాక్టరు బి.ఆర్ అంబేద్కర్ శత జయంతి ఉత్సవాల సందర్భాన్ని పురస్కరించుకోని ఈ భవనానికి డాక్టరు బి.ఆర్ అంబేద్కర్ సంక్షేమ భవనం అని నామకరణం చేసింది. నాటి నుంచి ఈ భవనంలో జిల్లా షెడ్యుల్డు కులముల సేవా సహకార సంఘం కార్యాలయం,ఆర్థిక సాక్షరతా కేంద్రం, అమూల్య విభాగం, పేదరిక నిర్మూలన మహిళల సమగ్ర అభివద్ధి కోసం ఏర్పాటు చేసిన మెప్మా విభాగం ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగా స్పందించి మెప్మా ప్రాజెక్టు కార్యాలయాన్ని మరో ప్రాంతానికి తరలించి అటు సిబ్బంది, ఇటు పొదుపు గ్రూపుల మహిళల ప్రాణాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరిన మెప్మా పీడీ కార్యాలయం..

మాట్లాడుతున్న నాయకులు

ధర్నాను జయప్రదం చేయండి : సిపిఐ

ప్రజాశక్తి-కందుకూరు :జూన్ 2వ తేదీన పేదలందరికీ పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాలలో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గృహ నిర్మాణానికి ఐదు లక్షలు మంజూరు చేయాలని కోరుతూ మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద జరుగు నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ నెల్లూరు జిల్లా సహాయ కార్యదర్శి పి మాలకొండయ్య తెలిపారు. శనివారం స్థానిక కోటారెడ్డి భవన్‌లో సిపిఐ కార్యవర్గ సమావేశం జరిగింది. పి.మాలకొండయ్య, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి.సురేష్ బాబు మాట్లాడారు. ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని దుయ్యబట్టారు. సిపిఐ కందుకూరు నియోజకవర్గం కార్యవర్గ సభ్యులు ఎస్కే హుస్సేన్, వై. ఆనంద్ మోహన్, కే మురళి, నత్త రామారావు పాల్గొన్నారు.

'కాకాణి' కేసు సిబిఐకి ఇవ్వండి..

కలెక్టరేట్‌లో వైసిపి నేతలు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి :మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అన్యాయంగా కేసులో ఇరికించారని, ఇందులో వాస్తవాలు బయటకు తీసుకురావాలంటే సిబిఐ విచారణ జరపాలని కాకాణి పూజిత డిమాండ్ చేశారు. శనివారం వైసిపి నేతలతో కలిసి ఆమె ఇన్‌చార్జ్ కలెక్టర్ కార్తీక్‌ను కలిశారు, పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఆనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎలాంటి ఆదారాలు లేకుండా అక్రమంగా కేసు పెట్టారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపుకు దిగిందన్నారు. గతంలో విచారణ జరిపి రిపోర్టు ఇచ్చినా మళ్లీ కూటమి ప్రభుత్వం కేసు పెట్టిందన్నారు. ఇలాంటి కేసులను వైసిపి పార్టీ ఉపేక్షిం చదన్నారు. మంత్రులు, ఎంపిలు,ఎంఎల్ఎలపై ఇలా అక్రమ కేసులు పెట్టి, భయపెట్టాలని చూస్తుందన్నారు. కాకాణి అరెస్ట్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినదించారు. ఆమె వెంట జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎంఎల్‌సి పి. చంద్రశేఖర్‌రెడ్డి, మేరగ మురళీ, మాజీ ఎంఎల్ఎ సంజీవయ్య, ఆనం విజయకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్యులు

నారాయణలో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి-నెల్లూరు :పొదలకూరు మండలం, అమ్మవారి పాళెం ప్రాంతానికి చెందిన ఆరేళ్ల బాలుడికి నారాయణ హాస్పిటల్ చిన్నపిల్లల శస్త్రచికిత్సల వైద్య నిపుణులు డాక్టరు గూడూరు సాయి సుబ్రమణ్యం అరుదైన శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు. శనివారం నారాయణ వైద్యశాలలో ఏర్పాటు చేసి విలేకర్ల సమావేశంలో ఈ శస్త్ర చికిత్సకు సంబంధించిన వివరాలు మీడియాకు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ పుట్టుకతోనే మలాశయానికి సమీపంలోని కొలన్ భాగంలో గ్యాంగ్లియన్ సెల్స్ (నాడీ కణాలు) లేకపోవడం వల్ల ఆభాగం చలనం లేకుండా మల విసర్జనకు అవరోధం ఏర్పడుతుం దన్నారు. దీనివల్ల దీర్ఘకాలిక మలబద్ధకం, పొట్ట ఉబ్బిపోవడం, పుట్టిన తర్వాత మొదటి 48 గంటలలో మెకోనియం (మలం పోకపోవడం) వంటి సమస్యలు ఏర్పడతాయన్నారు. ఈ అనారోగ్య సమస్యను వైద్యభాషలో హిర్ష్ స్పంగ్ వ్యాధిగా పేర్కొంటారన్నారు. ఈ సమస్యకు తాత్కాలిక పరిష్కారంగా లెవలింగ్ కొలొస్టామీ అనే ప్రాథమిక శస్త్రచికిత్సను ఈ బాలుడికి చెన్నైలో నిర్వహించారన్నారు. గత ఆరు సంవత్సరాలుగా ఈ సమస్యతో బాబు ఇబ్బంది పడుతూ నారాయణ వైద్యశాలకు తల్లిదండ్రులు తీసుకొచ్చారన్నారు. శస్త్రచికిత్సను విజయవంతం చేశామన్నారు. ప్రస్తుతం ఈ బాలుడికి సాధారణంగానే మలవిసర్జన అవుతుందన్నారు. నారాయణ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టరు బి. హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో మత్తువైద్య నిపుణులు డాక్టరు హరిత, డాక్టరు రజిత పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ ఆలస్యం..

ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్ :పింఛన్ల పంపిణీని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. జూన్ 1న తేదీన ఆదివారం కావడంతో మే 31వ తేదీనే పెన్షన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజా ప్రతినిధులు వారి వారి పరిధిలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఉదయం 6 గంటలకే ప్రారంభించారు. పట్టణ అభివద్ధి శాఖ మంత్రి నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పొంగూరు నారాయణ సిటీ నియోజకవర్గంలోని నాలుగో డివిజన్ మైపాడు గేట్ సెంటర్లో పెన్షన్ల పంపిణీ నగర్ కమిషనర్ నందన్ తదితర అధికారులు స్థానిక నేతలతో కలిసి ప్రారంభించేందుకు షెడ్యూల్ ఖరారు చేశారు. ఉదయం 6 గంటల నుంచి కమిషనర్ నందన్ హెల్త్ ఆఫీసర్ చైతన్య ఇతర కార్పొరేషన్ అధికారులు స్థానిక నేతలు మైపాడు గేట్ సెంటర్‌లో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారం భించేందుకు మంత్రి కోసం హాజరయ్యారు.10 గంటలు సమయం దాటినప్పటికీ మంత్రి హాజరు కాలేదు.మంత్రి రాకకోసం వారు నిరీక్షించారు.



పొగాకు వాడకంతో అనారోగ్యం

ప్రజాశక్తి-కావలి : స్థానిక విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అనంతపూర్ జె.ఎన్.టి.యు. వారి ఆదేశాల మేరకు "వరల్డ్ టొబాకో డే" సందర్భంగా శనివారం ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాము ఆఫీసర్ మధుకర్ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవంపై విద్యార్థులతో సెమినార్ నిర్వహించారు. సెమినార్‌కు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.అనిల్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని తమ కళాశాలలో నిర్వహించడంపై కళాశాల చైర్మన్ డి.విద్యాధర్ కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ డి.ప్రత్యూష రెడ్డి, అకడమిక్ ఇన్‌ఛార్జి డాక్టర్ డి.లిఖిత్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ కోచింగ్ క్యాంప్

ప్రజాశక్తి-కావలి : జవహర్ భారతి కళాశాల డాక్టర్ డి.ఆర్. క్రీడా ప్రాంగణంలో మే 1 నుంచి 31వ తేదీ వరకు డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ ఆదేశాల మేరకు నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంపులు శనివారంతో ముగిశాయి. ఇక్కడ వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నిస్, బాస్కెట్‌బాల్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ ముగింపు కార్యక్రమానికి పిల్లలందరికీ రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు టీషర్టులు స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల పిడి డాక్టర్ పి.ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ కళాశాల రెక్టర్ దొడ్ల వినయ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కళాశాల కరస్పాండెంట్ వి.సుధాకర్ రెడ్డికి ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. విశ్వోదయ ఇసి మెంబర్ మన్నేపల్లి వెంకటేశ్వర్లు, ఫిజికల్ డైరెక్టర్స్ పాల్గొన్నారు.

రంగులరాట్నం ఏర్పాటుకు 5న వేలం

ప్రజాశక్తి-విడవలూరు : రామతీర్థం గ్రామంలోని రామ లింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జూన్ 5వ తేదీన ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.50వేలు ధారావత్ చెల్లించి పాల్గొనాలని కోరారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి మర్రిపాడు క్లస్టర్‌కు చెందిన రైతులు 571పొగాకు బేళ్ళను వేలానికి తీసుకురాగా వీటిలో 394బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్తులు కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ తెలిపారు. 170 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారన్నారు. వాటిలో ఎన్ఎస్ 46ఎన్‌బి 87ఆర్‌ఆర్ 11సిఆర్ 26 ఉన్నాయన్నారు. అధిక బరువుతో ఉన్న 07 బేళ్లను వేలానికి అనుమతించలేదని తెలిపారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ఠ ధర రూ.200, సగటు ధర రూ.233.29కాగా 9మంది కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలియజేశారు.

యువత ఉన్నత స్థితికి చేరుకోవాలి

ప్రజాశక్తి-కావలి : యువత ఉద్యోగాలు సాధించి, ఉన్నత స్థితికి చేరాలంటే శ్రమించక తప్పదని ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. శనివారం కావలిలోని ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్, సిడాప్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ జాబ్‌మేళాలో 22 కంపెనీలు దాదాపు 1200 మందికి ఉద్యోగాలు కల్పించనున్నాయి. ముందుగాకాలేజీలోని మాగుంట సుబ్బరామరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి, నివా ళులర్పించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం, సీడాప్ జేడీఎం హైమావతి మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాకు సుమారుగా 761మంది నిరుద్యోగులు వివిధ కంపెనీల యందు పాల్గొన్నారని, వీరిలో మంచి ప్రతిభ కనబర్చిన 289 మందిని ఉద్యోగాలకి ఎంపిక చేశామన్నారు. ఎంపిక కాబడిన నిరుద్యోగులకు ఆయా కంపెనీ ప్రతినిధుల ద్వారా నియామక ఉత్తర్వులు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి, కాలేజీ ప్రిన్సిపాల్ టి.ఉమ, మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్, స్కిల్ డెవలప్మెంట్ ప్రతినిధులు ఖయూమ్, సిడాప్ ప్రాజెక్ట్ ఆఫీసర్ హైమావతి, కళాశాల సిబ్బంది, నిరుద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : కోవూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఆశీస్సులతో రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీగా బుచ్చిరెడ్డిపాలెం పట్టణానికి చెందిన కడివేటి అన్వేష్ కుమార్ రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా అన్వేష్ కుమార్ రెడ్డి శనివారం నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు స్థానిక పీ ఆర్‌ఎన్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఉన్న సమావేశ మందిరం నుంచి పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించడం జరిగినది. మండల విద్యాశాఖ అధికారి-2 వై. వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పాఠశాలలకు కేటాయించిన ఈ పాఠ్య పుస్తకాలు సంబంధిత పాఠశాలలో ఉన్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పంపిణీ చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

గ్రంథ పఠనం ఉపయోగకరం

ప్రజాశక్తి-కోవూరు : ప్రాథమిక దశ నుండి ప్రతి విద్యార్థి గ్రంథ పఠనం చేయడం ద్వారా వారిలో దాగి ఉన్న అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని రిటైర్డ్ ఎంపీడీఓ జయరామయ్య తెలిపారు. కోవూరులోని పడ్డపాల శంకర్ రెడ్డి శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా చిన్నారులకు పలు నీతి కథలకు సంబంధించిన విషయాలను వివరించారు.కార్యక్రమంలో గ్రంథాలయ బాండాగారి వై. సురేంద్రరెడ్డి, ఉపాధ్యాయులు పి. రంగారెడ్డి, విద్యార్థులున్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-కావలి : స్థానిక 29వ వార్డు బాలాజీ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి శనివారం ప్రారంభించారు. ప్రజలకు నాణ్యతతో కూడిన మంచి నీటిని అందించాలని ఎంఎల్ఎ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్, టిడిపి నాయకులు కండ్లగుంట మధుబాబు నాయుడు, స్థానిక వార్డు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో ప్రత్యేక కోర్సులు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం బిట్రగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల జూన్ రెండో తేదీ నుండి నుండి ప్రారంభం కానుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిట్రగుంట కళాశాల నందు ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్‌ఇసి, ఒకేషనల్, ప్రత్యేక కోర్సులు ఎం బైపిసి, ఎంఇసి గ్రూపులు ఇంగ్లీష్ మీడియం, తెలుగు మీడియంలో విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు వారికి నచ్చిన గ్రూపులలో చేరి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల ఆఫీసులో సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థులకు ఆర్థిక సహకారం

ప్రజాశక్తి-కావలి : ప్రతిభ ఉన్న నిరుపేద విద్యార్థులకు చదువుకునేందుకు ఆర్థిక సహకారం అందజేసేందుకు "మన రెడ్డి ఫౌండేషన్" ఆధ్వర్యంలో స్థానిక సాయి కోఆపరేటివ్ జూనియర్ కళాశాల ఆవరణలో 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో మెరిట్ సాధించిన 5 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి వారి చదువు కోసం ఆర్థిక సహకారం అందించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో మన రెడ్డి ఫౌండేషన్ సభ్యులు కూరపాటి కృష్ణారెడ్డి, బత్తిన ప్రభాకర రెడ్డి, చిన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, ప్రకాశం రెడ్డి సభ్యులు పాల్గొన్నారు.

మధు వృద్ధాశ్రమంలో పింఛన్ అందజేత

ప్రజాశక్తి-కావలి : ఏలూరుపాడు గ్రామంలో ఉన్న మధు వృద్ధాశ్రమంలో శనివారం పింఛను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. లింగసముద్రం మండలం చెందిన మోహన్ రావు అనే వృద్ధునికి, బిట్రగుంటకు చెందిన బొచ్చు బుజ్జమ్మకు సాలిపేట సచివాలయం సిబ్బంది పింఛను పంపిణీ చేశారు.

ఆధునికీకరణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం 22వ వార్డు వెంగళరావు నగర్‌లోని షాదీ మంజిల్ ఆధునికీకరణ పనులను కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. నాయకులు, అధికారులకు పలు సూచనలు చేశారు. నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేపట్టాలని, త్వరితగతిన పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్, డిఇ సాయిరాం, స్థానిక వార్డు నాయకులు, కార్యకర్తలు, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఉదయం ఆత్మకూరు ఆర్అండ్‌బి అతిథి గృహంలో మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పెండింగ్ అంశాలపై అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. శాఖలవారీగా జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు పరుగులు పెట్టిస్తున్నామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు పుష్కలంగా వున్నాయని, ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. పంప్‌హౌస్ వద్ద విద్యుత్ సమస్యలు లేకుండా తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ దీపాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని తెలిపారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో కొత్త వీధిలైట్లు అమర్చాలని, ఎక్కడ్కెనా లైట్లు వెలగపోతే వెంటనే మార్చాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆత్మకూరు ఆంజనేయస్వామి గుడి నుంచి నాలుగులైన్ల రోడ్లు నిర్మాణానికి

మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

రూ.6.30కోట్లు మంజూరయ్యాయని, సెంట్రల్ ల్యెటింగ్, సెంట్రల్ డివైడిరగ్ డిజైన్‌తో రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. పేదలకు ఇళ్ల నిర్మాణాలపై దృష్టి పెట్టాలన్నారు. వాగు పోరంబోకు స్థలాలను గుర్తించి ఎవరైనా పేదలు వుంటే వారికి పట్టాలివ్వాలని, లేనిపక్షంలో ప్రభుత్వపరం చేసుకుని ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించేందుకు సిద్ధంగా ఉంచాలన్నారు. టిడ్కో కాలనీలో తాగునీటి కోసం ఒ హెచ్‌ఆర్‌ను నిర్మించాలన్నారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మంత్రి ఆనం పిలుపునిచ్చారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు విద్రోహ దినం పాటిస్తామని రాద్ధాంతం చేస్తున్నాయని మంత్రి ఆనం మండిపడ్డారు. గత పదేళ్లుగా ఆత్మకూరుకు గత పాలకులు చేసింది శూన్యమన్నారు. మళ్లీ తమ ప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు మొదలయ్యాయన్నారు. గాడి తప్పిన అభివృద్ధిని పట్టాలెక్కిస్తున్నట్లు తెలిపారు. సోమశిల హైలెవల్ కెనాల్ పూర్తి చేయడం విద్రోహమా.. ఆత్మకూరు బ్యెపాస్‌రోడ్డును వెడల్పు చేసి అభివృద్ధి చేయడం విద్రోహమా.. ఎటువంటి సంబంధాలు లేని వీర్లగుడిపాడు గ్రామానికి రోడ్డు కం బ్రిడ్జి మంజూరు చేయించాలనుకోవడం విద్రోహమా, మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు మొదలుపెట్టడం విద్రోహమా.. వేల కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి పనులు పూర్తిచేయడం విద్రోహమా.. చెప్పాలని ప్రశ్నించారు. ఎవ్వరికి రాని ఆలోచనలతో ఆత్మకూరును అభివృద్ధి చేస్తున్నామని, కనీసం చూసైనా సంతృప్తి చెందాలని ప్రతిపక్షాలకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. ఎవరి బెదిరింపులకు భయపడే ప్రసక్తి లేదని, ప్రజలు తమకు ఇచ్చిన ఈ ఐదేళ్ల కాలంలో అన్ని హామీలను సంపూర్ణంగా అమలు చేసి అభివద్ధి చేసి చూపిస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

ఎసిబి వలలో విఆర్‌ఒ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని జమ్మవరం సచివాలయ విఆర్‌ఒ రూ.15వేలు లంచం తీసుకుంటుండంగా ఎసిబి వలకు చిక్కారు. మండలంలోని జమ్మవరం సచివాలయంలో శనివారం జిల్లా ఎసిబి డి.ఎస్.పి. శిరీష, కార్యాలయ అధికారులు దాడులు నిర్వహించి, విఆర్‌ఒను పటుకున్నారు. మండలంలోని జమ్మవరం గ్రామ పంచాయతీకి సంబంధించిన కాకర్లపాడు గ్రామానికి చెందిన త్రోవగుంట అశోక్‌కుమార్ వారి పెద్దమ్మకు చెందిన ఒక ఎకరా 78 సెంట్లు భూమి మ్యుటేషన్ కోసం గాను 21వ తేదీ అప్లై చేశారు. ఆ ఫైల్‌ను ప్రాసెస్ చేయడానికి విఆర్‌ఒ గంగాధర్ రూ.15 వేలు లంచం డిమాండ్ చేయడంతో, ఆ రైతు లంచం ఇచ్చేంత స్థోమత లేక ఎసిబిని ఆశ్రయించారు. స్పందించిన ఎసిబి డి.ఎస్.పి. శిరీష ఉదయాన్నే జమ్మవరం గ్రామానికి సాధారణ స్థితిలో చేరుకున్నారు.

ఎసిబికి పట్టుబడిన విఆర్‌ఒ

అనంతరం రైతుకు రూ.15వేల నగదును ఇచ్చి, సచివాలయంలోకి పంపించారు. వెనువెంటనే అధికారులు కూడా సచివాలయానికి వెళ్లడంతో విఆర్‌ఒ గంగాధర్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. అనంతరం ఎసిబి డి.ఎస్.పి. శిరీష మీడియాతో మాట్లాడుతూ వీఆర్వో గంగాధర్‌ను రూ.15వేలు లంచం తీసుకుంటూ ఉండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

ఎస్ఐ ఇంద్రసేనారెడ్డికి సన్మానం

ప్రజాశక్తి-ఉదయగిరి

రెండు సంవత్సరాలు పూర్తి చేసుకొన్న ఎస్ఐ కర్నాటి. ఇంద్రసేనారెడ్డికి తెలుగుదేశం పార్టీ మైనారిటీ నాయకులు షేక్.సంధాని భారత్ ఎలక్ట్రానిక్స్ ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఎస్ఐ విధులలో కులమతాలకు రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందారని కొనియాడారు.

ఎస్ఐ ఇంద్రసేనారెడ్డికి సన్మానిస్తున్న దృశ్యం

ఇలాంటి వ్యక్తికి సన్మానం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సికిందర్ తోటి దుకాణాల యాజమానులు పాల్గొన్నారు.

సమైక్యతా ర్యాలీ

ప్రజాశక్తి-అనంతసాగరం

దేశ సమగ్రత, మతసామరస్యం పరిరక్షణ కోసం సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమైక్యతా ర్యాలీని మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అన్వర్ బాషా మాట్లాడుతూ ఏప్రిల్ 22వ తేదీ కాశ్మీర్ పెహల్గంలో 26మంది యాత్రికులను ఉగ్రవాదులు జరిపిన దాడిలో మరణించారని, ఈ దాడిని దేశ ప్రజందరు మతాలకు అతీతంగా ఒక్కటిగా కలిసి ఎదుర్కొన్నారన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఉగ్రవాదులను అణిచివేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి సహకరిస్తామన్నారు. ఆ సమయంలో దేశ ప్రజలు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను భారత్ స్వాధీనం చేసుకొని, పాక్ ఉగ్రవాదులను పట్టుకుని ఉగ్రవాదాన్ని నాశనం చేసే ప్రయత్నం జరుగుతుందని ఆశించారు కానీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్, పాక్‌ల మధ్య యుద్ధం ఆపుతున్నామని చెప్పడంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం యుద్ధం ఆపడం అనేది దేశ సార్వభౌమాధికారానికి, దేశ సమగ్రతను అమెరికా వద్ద మోకరిల్లేలా చేశారన్నారు. ఉగ్రవాదానికి మతంతో సంబంధం లేదని, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్న దేశంలోని అన్ని మతాల ప్రజలు కలిసి సమైక్యంగా ఎదుర్కోవాలన్నారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు వేము పెంచలయ్య, ఉప్పలపాడు మస్తాన్, వెంకటేశ్వర్లు, జావిద్, బాబు, ఎజాజ్, అశోక్, నరసింహులు, మస్తాన్ బాషా పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కావలి : "పాలస్తీనా ముఖచిత్రం" రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) ప్రచురించిన పుస్తకావిష్కరణ సభకు (కావలిలోని శ్రీ సాయి డిగ్రీ కాలేజీలో) రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.సునీత అధ్యక్షత వహించగా ఎపిటిఎఫ్ మాజీ పట్టణ నాయకులు, రిటైర్డ్ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు పుస్తకావిష్కరణ చేశారు. వక్తలుగా 'ఉపాధ్యాయ' పత్రిక సంపదక వర్గ సభ్యులు గురునాథ శర్మ, ముస్లిం జెఎసి నాయకులు ముక్తి ఖలీల్ అహ్మద్, మౌలానా గులాం రసూల్, అబూ సులేమాన్, మౌలానా రషీద్, ఎఐఎఫ్‌టియు న్యూ నాయకులు ఎల్ లక్ష్మిరెడ్డి మాట్లాడగా, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.శ్యామల వక్తలను వేదికపైకి ఆహ్వానించారు. వక్తలు మాట్లాడుతూ ఇజ్రాయిల్ అమెరికా మద్దతుతో పాలస్తీనా జాతిహనన కార్యక్రమాన్ని సాగిస్తు ఒదన్నారు. పాలస్తీనాకు ప్రపంచ ప్రజలంతా సంఘీభావం తెలపాలన్నారు.

నందిపాడులో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-దుత్తలూరు : దుత్తలూరు మండలం నందిపాడు గ్రామంలో శనివారం జిల్లా ఫ్లోరోసిస్ అధికారిణి దివ్య ఆకస్మిక తనిఖీ చేశారు. నందిపాడు గ్రామంలో ఫ్లోరోసిస్‌తో బాధ పడుతున్న వారి ఇళ్లను సందర్శించి పరామర్శించి గతంలో ఇచ్చిన స్టిక్స్, వాకర్‌లు బిల్టలు ఉపయోగిస్తున్న తీరు ఉపయోగకరంగా ఉన్నాయా.. లేదా.. అని పేషెంట్‌లను అడిగి తెలుసుకొని వారికి విటమిన్ సి మందులు అందజేసి ఆరోగ్య అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఫ్లోరోసిస్ అధికారిణి దివ్య, డిఇఒ అనిత, దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి అయూబ్ అఫ్సర్, హెచ్ఇ ఎస్.కె.బీబీజన్, ఎంఎల్‌హెచ్‌పి మల్లిక, ఆశ కుమారి, మాధురి పాల్గొన్నారు.

పెద్దఎత్తున పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా వేల కోట్లాది రూపాయలు పింఛన్లకు ఖర్చు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని, పేదల సంక్షేమంపై ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఉదయం సంగం మండలం వీర్లగుడిపాడు గ్రామంలో పేదల సేవలో ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లను అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పంపిణీ చేశారు. గ్రామంలో లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని పింఛన్ల పంపిణీపై ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం చూపుతున్న ప్రత్యేక శ్రద్ధను, పేదల సంక్షేమానికి ఇస్తున్న ప్రాధాన్యతను లబ్ధిదారులకు వివరించారు. ప్రతి ఇంట్లో కూడా మంత్రిని ఘనంగా ఆహ్వానించిన లబ్ధిదారులు పింఛన్ల పంపిణీపై తమ సంతృప్తిని వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామని తమ సంతోషాన్ని మంత్రితో

పింఛన్ అందజేస్తున్న మంత్రి ఆనం

పంచుకున్నారు. ఆర్‌డిఒ పావని, ఎంపిడిఒ షాలేట్, తహశీల్దార్ సోమ్లానాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని బూదవాడలో టిడిపి బూత్ కన్వీనర్ ఆలా సురేషకుమార్ యాదవ్ వృద్ధులు వితంతువులకు, దివ్యాంగులకు సచివాలయం ఉద్యోగులతో కలిసి సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేశారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని 27 పంచాయతీల్లో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసినట్లు మండల టిడిపి అధ్యక్షులు చింతన బోయిన బయ్యన తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు బొజ్జ నరసింహులు, ఎస్‌సిసెల్ నాయకులు నల్లిపోగు రాజా, యువనాయకులు సంధాని, ఇఒపిఆర్‌డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దహనశాలల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం ఉత్తర శివార్లలోని రోటరీ క్లబ్ శ్మశాన వాటికలో నాలుగు దహనశాలలకు శంకుస్థాపన కార్యక్రమాన్ని శనివారం ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి నిర్వహించారు. అంకినపల్లి రమేష్ రెడ్డి సొంత నిధులతో సుమారు రూ.40 లక్షలు వెచ్చించి వీటిని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కావలి పట్టణంలో ఉత్తరం వైపున ఉన్నటువంటి "స్వర్గధామం" కావలి హిందువుల పాలిట దేవాలయం అని, ఈ శ్మశాన వాటికను రమేష్ రెడ్డి దాతృత్వంతో రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ వారి అందరినీ కూడా పేరుపేరునా అభినందిస్తున్నాన న్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ముందుకు వచ్చిన రమేష్ రెడ్డిని అభినందిస్తున్నానని తెలిపారు. గతంలో కూడా ఎంతోమంది దాతలు దర్శి సేవా సంస్థ, డాక్టర్ ఓబయ్య, ఈవిఎస్, అభ్యుదయ సేవా సంస్థ, కనమర్లపూడి కోటేశ్వరరావు, ఇలా ఎంతో మంది దాతలు కూడా శ్మశాన వాటికను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కావలిలో బాలకృష్ణారెడ్డి రెడ్డి ఏర్పాటు చేసిన హిందూ శ్మశాన వాటిక, దివంగత కలికి యానాదిరెడ్డిని ఖననం చేసిన పాపిరెడ్డి చెరువు పక్కన ఉన్న శ్మశాన వాటిక, ఇలా ఈ మూడు ప్రాంతాలను దాతలు ముందుకు వచ్చి అభివృద్ధి చేస్తే రుణం తీర్చుకున్నట్లవుతుందని తెలిపారు. శ్మశాన వాటికల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు.

ఎంఎల్ఎ సహకారంతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-బిట్రగుంట

ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి సహకారంతో మండలంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని టిడిపిమండల కార్యదర్శి లేళ్లపల్లి సుధీర్ పేర్కొన్నారు. విశ్వనాథరావుపేట పంచాయితీ రామస్వామి పాలెం గ్రామంలో ఓల్టేజ్ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడడంతో మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వర రావు, మండల కార్యదర్శి లేళ్లపల్లి సుధీర్ సమస్యను ఎలక్ట్రికల్ ఎఇ జడ రాయా దృష్టికి తీసుకొని వెళ్లడంతో శనివారం నూతన ఎలక్ట్రికల్ ట్రాన్స్ ఫారంను

అమర్చారు. ఈ మేరకు రాష్ట్రం అభివృద్ధికి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం చాలా అవసరమని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి యువత నాయకులు లీలపల్లి కిషోర్ బాబు, ధన్యాసి శ్రీధర్, శివ కోటయ్య, విద్యుత్ అధికారి జడ రాయా, విద్యుత్ శాఖ సిబ్బంది ఏలియా, సిబ్బంది తదితరులు ఉన్నారు.

యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఉదయగిరి

ఇందిరానగర్ కాలనీకి చెందిన గాలేటి నవ్య (18) అనే యువతి ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. కుటుంబీకుల వివరాలు మేరకు.. ఇంట్లోకి వెళ్లిన తన కుమార్తె ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో తల్లి కేకలు వేయడంతో అక్కడే ఉన్న స్థానికులు తలుపు తెరిచి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించిందని తెలిపారు. అనంతరం హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆ యువతి యృతి చెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని ఆత్మహత్య గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-మర్రిపాడు

ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడు సమక్షంలో దత్తత తీసుకున్న ఎడవల్లి గ్రామానికి చెందిన జ్ఞానమ్మ బంగారు కుటుంబానికి పడమటి నాయుడు పల్లి గ్రామానికి చెందిన సాహో ఫౌండేషన్ వ్యవస్థాపకులు నిష్ బిట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ అధినేత మార్గదర్శి పడచల నాగేశ్వరరావు జీవనోపాధి కోసం మేకలు కొనుగోలు నిమిత్తం లక్ష రూపాయల నగదు సహాయాన్ని ఆర్‌డిఒ పావని సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా బంగారు కుటుంబంగా ఎంపిక చేయబడ్డ జ్ఞానమ్మ కుటుంబాన్ని తాను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో దత్తత తీసుకోవడం జరిగిందని, అందులో భాగంగా వారికి ఉపాధి నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నానన్నారు. అంతే కాకుండా వారి నలుగురు బిడ్డలకు చదువు చెప్పించే బాధ్యతను తానే తీసుకుంటానన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-కావలి

కావలి సబ్ జైలులో శనివారం లోక్ అదాలత్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా అడిషనల్ జుడిషియల్ ఫస్టు క్లాసు మేజిస్ట్రేట్ జి.విక్రమ్ సిన్హా ముఖ్య అతిథిగా హాజరై, అక్కడ వున్న ఖైదీలకు అందుచున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు కొన్ని చట్టాలను వివరించారు. అలాగే సమాజంలో చెడు ప్రభావాలను విడిచి, నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్‌మెంబర్ ఐ.సాయి ప్రసాద్, మెంబర్ యం.మాలకొండారెడ్డి, జైలు సూపరింటెండెంట్ టీ.వీ.చిన్నసుబ్బయ్య, జైలు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కోవూరు

కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం రోజులు గడిచిన ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వారికి వెన్నుపోటు పొడిచారని, ఇందుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4వ తేది నిర్వహించనున్న వెన్నుపోటు దినం నిరసన ర్యాలీని కోవూరు నియోజకవర్గంలో విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు రావాలని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. కోవూరులోని వైఎస్సార్ సిపి కార్యాలయంలో శనివారం వెన్నుపోటు దినం పోస్టర్ను నాయకులు, ప్రజాప్రతినిధులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెట్టారన్నారు. కార్యక్రమంలో నల్లప రెడ్డి రజత్ కుమార్ రెడ్డి, నాయకులు వీరి చలపతి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, మండల కన్వీనర్లు అనూప్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎంఎల్ఎ నల్లపరెడ్డి

ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, లింగసముద్రం మండలం, చినపవని గ్రామ నివాసి **ముళ్ళపాటి రమ్య,** తండ్రి **వెంకటేశ్వర్లు** కు చెందిన పాస్ పోర్టు పోయినది. **M5543182** నెంబరు గల ఒరిజినల్ పాస్ పోర్టు చినపవని నుండి పెద్దపవని గ్రామానికి మోటార్ సైకిల్ పై వెళుతుండగా పోయినది. దొరికినవారు ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు
ముళ్ళపాటి రమ్య, తండ్రి **వెంకటేశ్వర్లు,**
ఇం.నెం: 3- 33B, చినపవని గ్రామం,
లింగసముద్రం మండలం,
SPSR నెల్లూరు జిల్లా. సెల్: **9948412107**

ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌కు అభినందనలు

ప్రజాశక్తి-ఉదయగిరి

మహానాడు వచ్చే క్రమంలో ఫడ్స్ రమణయ్యకు జరిగిన యాక్సిడెంట్‌లో తన కుటుంబంకు తానున్నానని తెలపడంతో కుటుంబసభ్యాలు నియోజవర్గ ప్రజా ఎంఎల్ఎకు అభినందలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గం తెలుగుదేశం కార్యకర్త ఫడ్స్ రమణయ్యకు జరిగిన యాక్సిడెంట్‌లో పరిస్థితి విషమంగా ఉందని సమాచార మాధ్యమాల ద్వారా తెలుసుకున్న వెంటనే స్వయంగా వారి కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా సంప్రదించి నేనున్నానని భరోసాను ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మహానాడు కార్యక్రమానికి వెళుతూ ప్రమాదానికి గురైన పడ్స్ రమణయ్య తిరుపతిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నారని కుటుంబ సభ్యుల ఆవేదనను తెలుసుకున్న ఎంఎల్ఎ కాకర్ల సురేష్ స్థానిక నేతల నుండి వివరాలను సేకరించి ఆయన కు అందుతున్న వైద్యం గురించి ప్రస్తుత పరిస్థితి గురించి ఆరా తీశారు. రమణయ్య కుమార్తెతో ఫోన్ ద్వారా మాట్లాడిన ఎంఎల్ఎ మెరుగైన చికిత్స కోసం చర్యలు తీసుకుంటున్నట్లు వారికి తెలిపారు. అంతేకాకుండా చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తానని తాను తోడుగా ఉంటానని వారికి ధైర్యం చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. టిడిపి కార్యకర్తలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న కాకర్ల సురేష్‌ను నియోజవర్గ ప్రజలు మనసారా దీవిస్తూ అభినందిస్తున్నారు.

సమైక్యతా యాత్రలు విజయవంతం

వీ క్ష ణం

ప్రజాశక్తి-నెల్లూరు : ఏప్రిల్ 22వ తేదీన జమ్ము కాశ్మీర్ ప్రాంతంలోని పహల్గాం వద్ద పాక్ ఉగ్రవాద దాడిలో 26 మంది పర్యాటకులను అత్యంత దారుణంగా బలితీసుకున్న తరుణంలో దేశంలో మత విద్వేషాలు చోటు చేసుకోకుండా నియంత్రించే భాగంలో వామపక్ష పార్టీ దేశ వ్యాప్తంగా సమైక్యత యాత్రలు నిర్వహించాలని పిలుపు నిచ్చింది. ఈ నేపథ్యంలో నగరంలో సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన సమైక్యత యాత్రలు విజయవంతంగా ముగిశాయి. ఈ యాత్రలో ప్రజలు స్వచ్ఛంగా పాల్గొని దేశ సమైక్యతను చాటారు. పొదలకూరు మండలం తాటిపర్తి సమీపంలో రుస్తుం మైన్‌లో అక్రమంగా క్వార్ట్జ్ తరలించడం, పేలుడు పదార్థాలు నిల్వ ఉంచడం,ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసులో ఏ 4 ముద్దాయిగా ఉన్న మాజీ మంత్రి, వైసిపి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పోలీసులు ఎట్టికేలకు అరెస్టు చేశారు. ఈ కేసుల్లో అరెస్టు కాకుండా బయట పడేందుకు ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును పలుమార్లు ఆశ్రయించారు. బెయిల్ ఇచ్చేందుకు కుదరదని జడ్జీలు తెల్చిచెప్పడంతో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టడంతో కర్నాటక రాష్ట్రం చింతామణి, వెంకట్రామపురం ఫాం హౌస్‌లో ఉన్నట్లు పక్కా సమాచారం అందుకున్న రాయచోటి పోలీసులు మాజీ మంత్రిని అదుపులోకి తీసుకొని జిల్లాకు తీసుకొచ్చారు. వెంకటగిరి కోర్టులో ఆయనకు 14 రోజులు రిమాండ్ విధిస్తూ తీర్పును వెల్లడించారు. జిల్లా జైలులో ఉన్న మాజీ మంత్రి కాకాణిని పలువురు వైసిపి నాయకులు పరామర్శించడంతోపాటు, ఆయన కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు.జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమం విజయవంతంగా అధికార యంత్రాంగా నిర్వహిస్తుంది. మహనాడులో జిల్లాకు చెందిన పలువురు ప్రముఖ టిడిపి నాయకులు హాజరు కావడమే కాకుండా భారీగా విరాళాలం అందజేసి పార్టీ నాయకుడి మన్ననలు పొందారు.

నెల్లూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.229 / 2024

విడవలూరు రామయ్య
అలియాస్ **విడవలూరు రామారావు** - వాది
మరియు
1. అనుమారెడ్డి నిర్మలమ్మ
అండ్ అదర్స్ - ప్రతివాదులు

నోటీసు

టు,
డి1. అనుమారెడ్డి నిర్మలమ్మ,
భర్త లేట్ **అనుమారెడ్డి వెంకట రాజ గోపాల్ రెడ్డి,**
డి3. అనుమారెడ్డి కిషోర్ రెడ్డి, అలియాస్ **క్రిష్ణకిషోర్ రెడ్డి** తండ్రి **అనుమారెడ్డి వెంకట రాజగోపాల్ రెడ్డి,**
డి4. అనుమారెడ్డి సుప్రజా,
తండ్రి లేట్ **అనుమారెడ్డి వెంకట రాజగోపాల్ రెడ్డి,**
డి1, డి3, డి4 అడ్రస్సు డోర్ నెం.26-1-538, పోలేరమ్మ వీధి, ఆర్టీఓ ఆఫీస్ దగ్గర, నెల్లూరు టౌన్.
డి7. కొమరగిరి శ్రీనివాసులు, తండ్రి **నరసింహం,**
అడ్రస్సు డోర్ నెం.1/906, బంగ్లాతోట,
నవాబుపేట, నెల్లూరు.

పై కోర్టు దావా నందు వాది ప్రతివాదులపై రెగ్యులర్ రిజిష్టర్ సేల్‌డీడ్ కొరకు పై కోర్టులో దావా దాఖలు చేయగా సమన్లు/నోటీసు నిమిత్తం **తేది: 11-07-2025** కి వాయిదా వేయబడియున్నది. కావున ప్రతివాదులు ఆరోజు **ఉదయం 10.30 గంటలకు** పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసియున్నది. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

ఇట్లు
ఓ.వెంకటరాజు
అడ్వకేటు, నెల్లూరు.

నెల్లూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No.108/ 2024
O.S.No.229 / 2024

విడవలూరు రామయ్య అలియాస్
విడవలూరు రామారావు - పిటిషనరు / వాది
మరియు
1. అనుమారెడ్డి నిర్మలమ్మ
అండ్ అదర్స్ - రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

నోటీసు

టు,
ఆర్1. అనుమారెడ్డి నిర్మలమ్మ,
భర్త లేట్ **అనుమారెడ్డి వెంకట రాజ గోపాల్ రెడ్డి,**
ఆర్3. అనుమారెడ్డి కిషోర్ రెడ్డి, అలియాస్ **క్రిష్ణకిషోర్ రెడ్డి** తండ్రి **అనుమారెడ్డి వెంకట రాజగోపాల్ రెడ్డి,**
ఆర్4. అనుమారెడ్డి సుప్రజా,
తండ్రి లేట్ **అనుమారెడ్డి వెంకట రాజగోపాల్ రెడ్డి,**
ఆర్1, ఆర్3, ఆర్4 అడ్రస్సు డోర్ నెం.26-1-538, పోలేరమ్మ వీధి, ఆర్టీఓ ఆఫీస్ దగ్గర, నెల్లూరు టౌన్.
ఆర్7. కొమరగిరి శ్రీనివాసులు, తండ్రి **నరసింహం,**
అడ్రస్సు డోర్ నెం.1/906, బంగ్లాతోట,
నవాబుపేట, నెల్లూరు.

పై కోర్టు పిటిషన్ నందు పిటిషనర్ రెస్పాండెంట్స్‌పై టెంపరరీ ఇంజంక్షన్ ఆర్డర్ కొరకు పై కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా నోటీసు నిమిత్తం **తేది: 11-07-2025** కి వాయిదా వేయబడియున్నది. కావున ప్రతివాదులు ఆరోజు **ఉదయం 10.30 గంటలకు** పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసియున్నది. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

ఇట్లు
ఓ.వెంకటరాజు
అడ్వకేటు, నెల్లూరు.